www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 25 జూన్ 2023
5
పశ్చిమ గోదావరి




కొనసాగిన వర్షం

ప్రజాశక్తి - ఆచంట



మండలంలో శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు రోడ్లపైకి గొడుగులతో వస్తున్నారు. సుమారు నెల రోజులపాటు తీవ్ర ఎండ వేడిమి, ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరైన చిన్నారులు, వృద్ధులు, ప్రజలు ఈ వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. వర్షాల రాకతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.



అభివాదం చేస్తున్న నేతలు

మరో విద్యుత్ ఉద్యమానికి నాంది

వామపక్షాల జిల్లా సదస్సు పిలుపు

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రతిఘటించేందుకు సమాయత్తం కావాలి

26న ఎంఎల్ఎలకు వినతులు అందజేత

28న విద్యుత్ సబ్‌స్టేషన్లు, కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం

వివిధ రకాల ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపి సామాన్య ప్రజానీకం నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ ఉద్యమానికి నాంది పలకాలని వామపక్షాల జిల్లా సదస్సు పిలుపునిచ్చింది. విద్యుత్ ఛార్జీల పెంపు, సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ఆలోచనను ప్రతిఘటించేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని కోరింది. దీనిలో భాగంగా ఈ నెల 26న జిల్లాలోని అందరు ఎంఎల్ఎలకు వినతిపత్రాలు అందజేత, 28న విద్యుత్ సబ్‌స్టేషన్లు, కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 30 తర్వాత మరో బషీర్‌బాగ్ ఉద్యమం తలపించేలా విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా పోరాడుతామని సదస్సు ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

స్థానిక ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో విద్యుత్ భారాలను, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సుకు సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి సిహెచ్.రంగారావు, ఫార్వర్డ్‌బ్లాక్ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసరాజు అధ్యక్షత వహించారు. వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచుతుందని వారు విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో మరో భారాన్ని మోపేందుకు ఆలోచన చేస్తుందని మండిపడ్డారు. సదస్సులో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, బొక్కా సత్యనారాయణ, బి.చైతన్యప్రసాద్, డి.త్రిమూర్తులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాంప్రసాద్, కళింగ లక్ష్మణరావు, సనపల శ్రీను పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి

లంక కృష్ణమూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి



వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచింది. ఇవే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలు కిలో రూ.100 నుంచి రూ.180 వరకు పెరిగాయి. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్యాస్ సిలెండర్ ధర రూ.430 ఉంటే ప్రస్తుతం రూ.1200కు పెరిగింది . ఇలా ఏదైనా పెంచుకుంటూ పోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ప్రజల్లో చైతన్యం రావాలి. అప్పుడే ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పగలం.

విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలి

కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి



గతంలో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు అదనపు ఛార్జీల వసూలు తగదు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజానీకం అల్లాడుతున్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలతో భారం మరింత పెరిగింది. కేంద్రంలో బిజెపి విధానాలను ఇక్కడ వైసిపి అమలు చేయడం దారుణం. డే ఆఫ్ నైట్ పేరుతో 20 శాతం విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గం. విద్యుత్ ఛార్జీల వ్యతిరేక ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. విద్యుత్ భారాలు ఉపసంహరించుకోకపోతే జరిగే పరిణామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత.

విద్యుత్ ఛార్జీల వ్యతిరేక పోరాటానికి అంతా కలిసి రావాలి

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



గతంలో చంద్రబాబు ప్రపంచబ్యాంక్ ఆదేశాలకు తలొగ్గి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి సంస్కరణల పేరుతో ఛార్జీలు పెంచి రూ.వెయ్యి కోట్ల భారం మోపారు. నాడు వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యుత్ ఉద్యమంలో ముగ్గురు తమ ప్రాణాలను కోల్పోయారు. దీంతో నాటి నుంచి పదేళ్లపాటు విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు ప్రభుత్వాలు సాహసం చేయలేదు. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా ఎనర్జీ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూఅప్ ఛార్జీ, ఇడి, ఇటిసి, ఎఫ్‌విపిసిఎ ఇలా అనేక రకాల ఛార్జీలు పెంచింది. ఈ ఛార్జీలేమిటీ అని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని అడిగినా వారికీ తెలియని తెలియని పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం అప్పు కోసం కేంద్రం షరతులకు తలొగ్గి వినాశకర విద్యుత్ విధానాలు అమలు చేస్తోంది. విద్యుత్ తయారీ, పంపిణీ, నిర్వహణలపై పెట్టుబడులు పెడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. కొత్తగా స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన చేస్తోంది. ఈ మీటర్ల ఏర్పాటుకు డబ్బులు కూడా వినియోగదారుల దగ్గర వసూలు చేయనుంది. విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టనున్నారు. ఇది అమలైతే విద్యుత్ పూర్తిగా ప్రయివేటుపరం కావడంతోపాటు ఎస్‌సి, ఎస్‌టికు, పరిశ్రమలకు సబ్సిడీలు కూడా ఉండవు. వామపక్షాల ఆధ్వర్యంలో జరిగే విద్యుత్ ఛార్జీల వ్యతిరేక పోరాటాలకు అంతా కలిసి రావాలి.

పవన్ ప్లానేమిటో..!

నేడు జిల్లాలోకి ప్రవేశించనున్న జనసేన వారాహి యాత్ర

26న నరసాపురంలో బహిరంగ సభ, అదేరోజు భీమవరం రాక

భీమవరంలో మూడు రోజులు బస

కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందంటున్న నేతలు

వేడెక్కిన భీమవరం రాజకీయం



ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జిల్లా పర్యటన నేపథ్యంలో అందరి చూపు భీమవరం వైపే ఉంది. జనసేన చేపట్టిన వారాహి యాత్ర అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి ఈ నెల 25వ తేదీ రాత్రి జిల్లాలోకి ప్రవేశించనుంది. ఈ నెల 26న నరసాపురంలో బహిరంగ సభ నిర్వహించి అదే రోజు రాత్రికి పవన్ భీమవరం చేరుకుంటారు. మూడు రోజులపాటు ఇక్కడే బస చేయనున్నారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పవన్‌పర్యటన రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

విద్య, వైద్యం, వ్యాపార రంగాలతోపాటు రాజకీయంగా భీమవరం ఎంతో ప్రసిద్ధి. ఎంతోమంది ఉద్దండులు, స్వాతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు అగ్రనేతలు, శాస్త్రవేత్తలు, రాజకీయ ప్రముఖులు సైతం ఇక్కడ జన్మించి ఎదిగారు. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇక్కడి నుండి పోటీ చేసి ఓటమి పాలవడంతో రాష్ట్ర రాజకీయం భీమవరం వైపు చూసింది. అయితే ప్రస్తుతం పవన్ పర్యటనతో అందరి చూపు మరోసారి భీమవరంపై పడింది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన వారాహి యాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నెల 14 ప్రారంభమైన ఈ యాత్ర ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి ఈ నెల 25వ తేదీ రాత్రి జిల్లాలోకి ప్రవేశించనుంది. ఈ నేపథ్యంలో పవన్ పర్యటన ఏర్పాట్లను జనసైనికులు చురుగ్గా చేస్తున్నారు. చించినాడ బ్రిడ్జి మీదుగా పవన్ నరసాపురం చేరుకుని ఈ నెల 26వ తేదీ సాయంత్రం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అదే రోజు రాత్రి భీమవరం చేరుకుంటారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు ఇప్పటికే ప్రకటించారు. భీమవరం నియోజకవర్గంలోపాటు మరి కొన్ని నియోజకవర్గాల నాయకులతో సమావేశం అనంతరం పర్యటన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మూడు రోజుల బస.. కీలక నిర్ణయాలకు అవకాశం

పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటన నేపథ్యంలో కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమిపాలైన జనసేన తాజాగా కొంతమేర పట్టు సాధించింది. జిల్లాలో నియోజకవర్గాలవారీ సమావేశాలు నిర్వహించనున్నారు. రాజకీయ పరిణామాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు నియోజకవర్గాల నేతలు పవన్‌కు అందించనున్నట్లు తెలిసింది. మూడు రోజులపాటు ఇక్కడే పవన్ ఇక్కడే బస చేయనుండటంతో రాజకీయ పరిశీలకుల చూపు భీమవరంవైపు మళ్లింది.

సీట్లపై చర్చ.. భీమవరంపై సస్పెన్స్

పవన్ పర్యటన నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రజల్లో సర్వత్రా రాజకీయ చర్చ సాగుతోంది. ప్రధానంగా అభ్యర్థుల సీట్లపై ఉంటుందని, మరోవైపు భీమవరం నుంచి పోటీ చేసే అభ్యర్థి పేరు ప్రకటిస్తారేమోననే చర్చ సాగుతోంది. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలపై జనసేన ప్రధానంగా దృష్టి పెట్టినట్లు తెలిసింది. నరసాపురం అభ్యర్థి విషయంలో ఇప్పటికే ఒక స్పష్టత ఉన్నప్పటికీ తాడేపల్లిగూడెం, భీమవరం అభ్యర్థులపై అందరిలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిలా ఉంటే భీమవరం నుంచి పవన్‌కళ్యాణ్ పోటీ చేయాలని పార్టీ నాయకులు పట్టుబడుతున్నట్లు తెలిసింది. అయితే పవన్ మాత్రం భీమవరం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు)కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో భీమవరంలో పవన్ కళ్యాణ్ నాయకులతో విస్తృత చర్చలు జరిపి కీలక నిర్ణయాలు భీమవరం వేదికగా ప్రకటిస్తారని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పవన్ పర్యటనపై సర్వత్రా ఉత్కంఠ

భీమవరంలో అధికార పార్టీ వైసిపి, జనసేన మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్నాయి. పరస్పర విమర్శలు చేసుకోవడంలో ఈ రెండు పార్టీలు నువ్వానేనా అన్నట్లు వ్యవహరిస్తాయి. గతంలో చోటుచేసుకున్న అనేక ఘటనలు దీనికి నిదర్శనం. నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ పరిణామాలు, ఫ్లెక్సీల వివాదం తారాస్థాయికి చేరిన పరిస్థితి ఉంది. వారాహి యాత్ర బహిరంగ సభలో పవన్ ఓటమికి గల కారణాలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. దీంతో వైసిపి కూడా పవన్ వ్యాఖ్యలకు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో పవన్ ఇక్కడి నుంచి చేసే వ్యాఖ్యలు, కీలక నిర్ణయాలు ఏ విధంగా ఉండబోతాయోనని సర్వత్రా చర్చ సాగుతోంది.

ప్రయివేటు విద్యాసంస్థల్లో పుస్తకాల గదులు సీజ్


యాజమాన్యాలకు నోటీసులు జారీ

ఎస్ఎఫ్ఐ ఆందోళనతో కదిలిన విద్యాశాఖాధికారులు

విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షించాలి: ఎస్ఎఫ్ఐ



భీమవరం నారాయణలో పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న డివైఇఒ



పెనుగొండ శ్రీ చైతన్యలో సీజ్ చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం నారాయణ స్కూల్‌లో పుస్తకాల అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల అమ్మకం ఏమిటని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో యాజమాన్యానికి, ఎస్ఎఫ్ఐ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పుస్తకాల వ్యాపారం చేస్తున్న నారాయణ స్కూలుపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు నేలపై బైఠాయించారు. ఈ నేపథ్యంలో భీమవరం డివైఇఒ శ్రీరామ్ స్కూల్‌కు చేరుకుని ఎస్ఎఫ్ఐ నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ సమస్యను ఆయనకు వివరించారు. దీంతో డివైఇఒ పుస్తకాల గదిని పరిశీలించి అమ్మకాలకు సంబంధించిన రికార్డును తనిఖీ చేశారు. అనంతరం పుస్తకాల గదిని సీజ్ చేశారు. స్కూలు యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మకాలు సాగిస్తే సంబంధిత స్కూళ్లపై చర్యలు తప్పవని డివైఇఒ శ్రీరామ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా బహిరంగంగా పుస్తకాలు అమ్మడ దారుణమన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు ఇషారాజ్యంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడి పాఠశాలలను తనిఖీ చేసి ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యు.వినోద్, బి.గణేష్, ఎం.శివ, జి.శ్రీను, టి.చిరంజీవి, కె.నాని పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు విద్యాసంస్థల్లో పుస్తకాల అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. పట్టణంలోని నారాయణ, శ్రీ చైతన్య, భాష్యం విద్యాసంస్థల్లో అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్నారనే సమాచారం తెలియడంతో ఆ పాఠశాలలను శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ విద్యాకేంద్రాలను ప్రయివేటు యాజమాన్యాలు వ్యాపార కేంద్రాలుగా మార్చారని మండిపడ్డారు. అనంతరం స్థానిక ఎంఇఒకు సమాచారం అందించగా అక్కడికొచ్చిన సిబ్బంది పుస్తకాల గదిని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పి.నాగేంద్ర, టి.రవిబాబు, నాయకులు దుర్గ, నాగబాబు పాల్గొన్నారు.

పెనుగొండ: స్థానిక శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పాఠ్యపుస్తకాలు అమ్మడాన్ని నిరసిస్తూ ఆ స్కూల్ వద్ద ఎస్ఎఫ్ఐ నేతలు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.మనోజ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రయివేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో రంగంలోకి దిగిన విద్యాశాఖ అధికారులు పాఠ్యపుస్తకాలు ఉంచిన గదిని సీజ్ చేశారు. అనంతరం ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.ఈశ్వర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న నేతలు

చించినాడ దీక్షలకు ఐద్వా సంఘీభావం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడలో లంక భూముల కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శనివారం 18వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ నేతలు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ పేదల ఆధీనంలో ఉన్న పెరుగులంక భూముల్లో మట్టిని తరలించిన ప్రజాప్రతినిధులు, అధికారులపై వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. పేదలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేసి అర్హులైన పేదలందరికీ డి ఫారం పట్టాలు పంపిణీ చేసే వరకు ఇక్కడి పేదల పోరాటానికి ఐద్వా పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు కేతా పద్మజ, నేతలు ఎస్.ఉదయకుమారి, డోకల లక్ష్మి, నాగరత్నం, యశోద, సరోజిని, శ్యామల, పావని జయప్రభ, సుగుణ, ప్రియాంక, విజయ, ఝాన్సీ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూర్ణ

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

వివిధ రకాల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక స్వరాజ్య భవనంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, ప్రజలపై భారాలు ఆపాలని, విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ ఆపాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు, ప్రతాప్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఒకపక్క పథకాలు ఇచ్చి, మరోపక్క ఛార్జీల పేరుతో లాక్కోవడం సిగ్గు చేటన్నారు. విద్యుత్ రంగాన్ని అదానికి అప్పగించడం వల్లే ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, పి.దత్తాత్రేయ ప్రసాద్, పి.అమ్మిరాజు, బి.మురళీకృష్ణ, నూనె రాధాకృష్ణ, పీడీ.మూర్తి పాల్గొన్నారు.

ఛార్జీల మోత.. ఫీజుల వాత..!

ఇళ్లల్లో విద్యుత్ ఛార్జీల మోత.. విద్యాసంస్థల్లో ఫీజుల వాతతో జిల్లావాసులు తీవ్ర నిస్తేజం.. ఆవేదనకు గురవుతున్నారు. మరోపక్క కోలుకుంటుందని అంతా అనుకుంటున్న దశలో పరిస్థితి విషమించి యాసిడ్ దాడి బాధితురాలు మృతి చెందడం అందరినీ తీవ్ర ఆవేదనకు గురి చేసింది. ఇక పోలవరం పోరుకేక పేరిట నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన మహా పాదయాత్ర జిల్లాలో వచ్చే సోమవారం ప్రవేశించనున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు సాగించడంతోపాటు ప్రచారం పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు.

ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల మోత తల్లిదండ్రులను తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురిచేస్తోంది. దీనికితోడు డీజిల్ ధరలు ఈ కాలంలో పెరగకపోయినప్పటికీ రోడ్లు బాగోలేదని, ఇతర కారణాలు చూపుతూ బస్సు ఫీజులు సైతం 20 శాతం వరకూ పెంచేశారు. ఇక పుస్తకాల పేరిట సాగుతున్న దోపిడీ అంతాఇంతా కాదు. మూడో తరగతి నుంచే కనీసం ఒక్కో విద్యార్థికి పుస్తకాల పేరిట రూ.ఐదు వేలకు తగ్గకుండా వసూలు చేస్తుండటం గమనార్హం. దీనిపై భీమవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆయా విద్యాసంస్థల వద్ద చేపట్టిన ఆందోళనలే నిదర్శనం. మొత్తంగా పరిశీలిస్తే గత సంవత్సరంకన్నా 30 నుంచి 40 శాతం అదనంగా ఫీజులు వసూలు చేస్తుండటం కార్పొరేట్ విద్యాసంస్థలకే చెల్లిందనేది నగ్నసత్యం. అయితే జిల్లా కేంద్రాల్లో సైతం జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించకపోవడం గమనార్హం. రాజకీయ నేతల, ప్రజాప్రతినిధులు, పెద్దల ఒత్తిళ్లతో విద్యాశాఖాధికారులు మౌనం వహిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. విద్యారంగానికి పెద్దపీట వేస్తూ నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టే విషయంలో ఎందుకు ఉదాశీనంగా వ్యవహరిస్తుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది.



విద్యుత్ ఛార్జీల మోతతో జనం తల్లడిల్లుతున్నారు. ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు, వినియోగ ఛార్జీల పేరిట ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు వడ్డన ఏమిటోనని జనం తలలు పట్టుకుంటున్నారు. పథకాల అమలులో కూడా ఇలా పాతవి ఎందుకివ్వరని, ఇచ్చే దగ్గరేమో ముందస్తు తేదీలు, వసూళ్లలో మాత్రం వెనుక సంవత్సరాలు అనే విధానం అమలు చేస్తారా అని అంతా ప్రశ్నిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల అంశం కూడా విద్యుత్ వినియోగదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మొత్తంగా విద్యుత్ బిల్లులు ముట్టుకున్నా షాక్ కొట్టే పరిస్థితి ఏర్పడిందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ప్రభుత్వానికి తాము షాక్ ఇవ్వక తప్పదని విద్యుత్ వినియోగదారులు హెచ్చరిస్తున్నారు.

ఏలూరులో యాసిడ్ దాడిలో తీవ్ర గాయాల పాలైన ఫ్రాన్సిక పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయింది. దాడి ఘటనే తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. డిఐజి, ఎస్‌పి ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు జిల్లా అధికారులు ప్రయత్నం చేయడంతోపాటు ఆర్థికంగా అండగా నిలిచేందుకు సిద్ధమని ప్రకటించారు. అయినా ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఫ్రాన్సిక మృతితో అనేకాంశాలు తెరపైకి వచ్చాయి. ఘటన జరిగాక జిల్లా అధికారులు స్పందించిన తీరు ప్రశంసనీయమే అయినా ప్రాణం రక్షించలేకపోయామనేది అందరికీ బాధ కల్గించే అంశం. ఇప్పటికైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్షం, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలతో ప్రభుత్వం చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చట్టాలున్నాయని పదేపదే ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే నేతలు, అధికారులు ఆ చట్టాల అమలులో నిష్పక్షపాతంగా, పకడ్బందీగా వ్యవహరిస్తే ఈ ఘటనలు పునరావృతం కావనేది పరిశీలకుల అభిప్రాయం.

ఉమ్మడి జిల్లాలో పోలవరం పోరుకేక మహా పాదయాత్ర ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత ఐదు రోజులుగా పాదయాత్ర అత్యంత ఉత్సాహపూరిత, ఉత్తేజభరిత వాతావరణంలో ముందుకు సాగుతోంది. కారుచీకట్లలో వర్షపు జల్లుల్లో యాత్ర గోదావరి ప్రవాహంలా ముందుకు సాగుతోంది. అధికారమే పరమావధిగా అటు అధికారపక్షం, ఇటు ప్రతిపక్షాల నేతలు చేపడుతున్న యాత్రలకు భిన్నంగా పోలవరం నిర్వాసితులకు అండగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వాన చేపట్టిన పోలవరం పోరుకేక పాదయాత్ర అటు రాజకీయ వర్గాలు, అధికారుల్లో, ఇటు ప్రజల్లో పెద్దఎత్తున చర్చనీయాంశమవుతోంది. ఈ నెల 26న వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట వద్ద జిల్లాలోకి ప్రవేశించే యాత్రకు స్వాగతం పలికేందుకు, జులై ఒకటో తేదీ వరకూ విజయవంతంగా ముందుకు సాగించేందుకు సిపిఎం శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. దీనికి పోలవరం నిర్వాసితులు, గిరిజనులతోపాటు వివిధ సంఘాలు, పార్టీలు, సంస్థలు సైతం మద్దతు పలుకుతూ సహకారం అందించడానికి ముందుకు రావడంతో యాత్రకు ముందే నిర్వాసితులు సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు. ఇదే స్ఫూర్తితో సిపిఎం ఆధ్వర్యాన పోలవరం నిర్వాసితుల పోరుకేక పాదయాత్ర తదుపరి ఉద్యమ కార్యాచరణకు నాంది కానుందని చెప్పొచ్చు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

బధిర పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మూగవారైన బధిర బాలలు రాష్ట్ర వ్యాప్తంగా టిటిడి దేవస్థానం బధిర పాఠశాలను స్థాపించి వారి జీవితాల్లో వెలుగునింపడం అభినందనీయమని ఉద్దరాజు అనందరాజు ఫౌండేషన్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు అన్నారు. భీమవరం శ్రీవిజయదుర్గ బధిర పాఠశాలకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సుమారు రూ.రెండు లక్షల విలువైన నాలుగు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లను శనివారం అందించారు. ఈ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడు అందిస్తామన్నారు. చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ఈ పాఠశాలలోని విద్యార్థులు 12 మందికి 12 మంది నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.తిరుపతిరావు, ఉద్దరాజు జోగిరాజు, వడవల సత్యనారాయణ, బి.పద్మనాభరాజు, గాయత్రి, విజయ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

తన స్వగ్రామమైన మేకలదిబ్బ ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరికీ విద్యాసామగ్రిని అందించేందుకు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య ముందుకు రావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు కోట వెంకటరామయ్య అన్నారు. శనివారం మేకలదిబ్బ ప్రాథమిక పాఠశాలలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ తన మూలాలను మరచిపోకుండా ప్రతిభకల్గిన విద్యార్థులను ప్రోత్సహించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కొంతకాలంగా ప్రతిభ చాటి మాటలాడిన విద్యార్థులకు హైస్కూల్లో పది తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఎంతో ఉపయోగపడే యుటిఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్ పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెల్లుబోయిన యశ్వంత్, పాఠశాల ఉపాధ్యాయులు పాలా నాగశ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

డిఎన్ఆర్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

డిఎన్ఆర్ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 20 మంది విద్యార్థులు జస్ట్ డయల్, క్యాప్ జెమిని అనే సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు కళాశాల వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండురంగరాజు తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బిఎస్.శాంతకుమారి, పాలకవర్గ సభ్యులు పి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఆయా సంస్థల్లో ఫైనాన్షియల్ అకౌంటింగ్, కస్టమర్ రిలేషన్, మార్కెటింగ్ పలు విభాగాల్లో సంవత్సరానికి రూ.2.80 లక్షల పైబడి ప్యాకేజీతో ఎంపికయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిజి కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎ.కృష్ణమోహన్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.సోమరాజు, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎమ్.డి.సిరాజ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి పి.శిరీష్కుమార్, ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : బివి రాజు డిగ్రీ కళాశాలలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ హైదరాబాద్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 13 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. బిఎస్సి బయోకెమికల్ విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి రూ.2.7 లక్షల వార్షిక వేతనం వస్తుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ కెవి.విష్ణురాజు, వైస్ ఛైర్మన్ రవిచంద్రన్, సెక్రటరీ ఆదిత్య, డైరెక్టర్ జి.ప్రసాద్రాజు, దిశ సూర్యనారాయణరాజు అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ సిఎస్ఎన్ కాలేజీలో ఫార్మసీ మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులు టి.శ్యామల్, ఎన్.రామ ఈ నెల 22వ తేదీన గుంటూరులో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిర్వహించిన క్విజ్ పోటీల్లో తృతీయ బహుమతిని, రూ.50 వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వారిని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నాలెడ్జ్ పెంచుకునేందుకు ఇటువంటి క్విజ్ పోటీలలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ పెమ్మాడి రఘువీరవర్మ, వైస్ ప్రిన్సిపల్ కె.దుర్గాప్రసాద్, గెడ్డం భాస్కరరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - పెనుమంట్ర

లక్ష్యానికి అనుగుణంగా జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ పూర్ణ బాబ్జి ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు జగనన్న గృహ నిర్మాణాలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో బిబిఎల్లో ఉన్న గృహాలన్నిటినీ బిఎల్ స్టేజికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ ఎం.గోపాలరాజు, ఎఇ ఎకె.మల్లేశ్వరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. వైసిపి మండల సోషల్ మీడియా ఇన్ఛార్జిగా నియమితులైన కవురుసత్యనారాయణను శనివారం ఆయన శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ నవరత్నాలతో పాటు ప్రతి కార్యక్రమాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సొసైటీ ఛైర్మన్ దొంగ నాగముని, కవురు ఆదినారాయణ, కవురు సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు పాల్గొన్నారు.

మంచి ఆహారంతో కళ్లకు రక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో కంటి కేటరాక్ట్ పరీక్షపై అవగాహన సదస్సు శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, లయన్స్ క్లబ్ మేనేజర్ లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కని ఆరోగ్యాన్ని పొందేందుకు తగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కంటిలో ఏర్పడే కేటరాక్ట్ లోపాన్ని నివారించవచ్చన్నారు. రోటరీ లయన్స్ క్లబ్ మేనేజర్ లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు తగిన ఆరోగ్య నియమాలు పాటిస్తూ జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.సుబ్బలక్ష్మి, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీలో అవకతవకలకు పాల్పడొద్దు

ప్రజాశక్తి - మొగల్తూరు


ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని మండల పరిషత్ ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామంలోని సత్రవుపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. నాడు-నేడులో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను, కొత్తకాయలతిప్పలో జగనన్న లేఅవుట్ను పరిశీలించారు. ఆమెతో పాటు ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజు, సిడిపిఒ ఊర్మిల, హౌసింగ్ ఎఇ ఫణీంద్ర, ఎపిఒ వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

25.5 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు గ్రామంలో గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను పాలకోడేరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 25.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు శనివారం గరగపర్రులో వాహన తనిఖీ చేస్తుండగా తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేస్తున్న సమయంలో అందులో ప్రయాణిస్తున్న ఐదురుగు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని తనిఖీ చేసి అందులో తరలిస్తున్న 25.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన సిహెచ్.సురేష్, పి.ఉమామహేశ్వరరావు, పి.కిరణ్బాబు, డి.పూర్ణచంద్రరావు, బి.సత్యస్వరూప్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. సిఐ నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఎన్నికైన మండల నూతన కమిటీ

మానవత సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి - గణపవరం

మానవత సంస్థ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తృతం చేస్తామని మానవత సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. శుక్రవారం రాత్రి గణపవరంలో కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో మానవత మండల కమిటీ సమావేశం మండల కమిటీ అధ్యక్షులు వంకాయల రామారావు అధ్యక్షతన నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. గతేడాది సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలను కమిటీ అధ్యక్షులు వంకాయ రామారావు నివేదించారు. మండలంలో పది పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపి విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. అనంతరం మానవత మండల కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా కంతేటి సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షులుగా బుద్దాల పుల్లయ్య, కార్యదర్శిగా మాదేపల్లి చిరంజీవి, కోశాధికారిగా పెరుమాళ్ల ఆంజనేయులుతో నూతన కమిటీ ఏర్పడింది. ఈ సమావేశంలో రీజియన్ ఛైర్మన్ కాకర్ల వినాయక, మానవత కెరియర్ గైడెన్స్ ఛైర్మన్ తాడేపల్లి మోహన్రావు, సంస్థ జిల్లా మాజీ అధ్యక్షులు సాగిరాజు జానకిరామరాజు, గణపవరం సర్పంచి మోర అలంకారం, మండల ఉపాధ్యక్షురాలు రత్న దుర్గకుమారి, ఆర్యవైశ్య సంఘ భవనం అధ్యక్షులు ఆర్విఎస్.రాజు పాల్గొన్నారు.

నేడు ఫ్యాప్టో విద్యాసదస్సు

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై రాష్ట్ర ఫ్యాప్టో ఇచ్చిన పిలుపులో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం ఏలూరులోని ఎన్జిఒ కార్యాలయంలో ఈ నెల 25న ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ, ఉద్యోగుల విద్యా సదస్సుకు అంతా తరలి రావాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఫ్యాప్టో నాయకులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు.

30న విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి - వీరవాసరం

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద నిర్వహించే మహాధర్నాకు రైతులంతా కదలి రావాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం నవుడూరులో మహాధర్నా వాల్పోస్టర్ను ఆవిష్కరించి, కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, రైతులు చింతపల్లి శ్రీరామూర్తి, చెల్లబోయిన సత్యనారాయణ, నున్న సత్యనారాయణ, మైగాపుల త్రిమూర్తులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పోడూరు

నష్టపోయిన ధాన్యం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కోరారు. ఈ మేరకు శనివారం పంట మునిగింది పరిహారం ఇవ్వండి అంటూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొల్లు నియోజకవర్గంలో ఎనిమిది గ్రామాల్లో పంట నష్టం నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి నష్టపోయిన రైతుల వివరాలను పార్టీ నాయకులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల మాట్లాడుతూ నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రైతులకు టిడిపి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, భూపతి రాజు సూర్యనారాయణరాజు, కుక్కల మునీశ్వరావు, దొమ్మేటి శ్రీను, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.

కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చినఅమిరంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మత్తు పదార్థాలు-మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ శేషుకుమార్, ఎఒ రామారావు, ఇతర ఫేకల్టీ సభ్యులు సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మత్తు పదార్థాలు - మాదక ద్రవ్యాల వినియోగం, పర్యవసానాల గురించి, చట్టం గురించి, విద్యార్థుల బాధ్యత గురించి సబ్ ఇన్స్పెక్టర్ వర్మ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు జి.సునీల్కుమార్, బి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది శ్రీమన్నారాయణ, గణేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా డేటా సేకరణ ప్రారంభం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు పరిధిలోని గృహాలను వాలంటీర్లు సందర్శించి క్షేత్ర స్థాయిలో డేటా సేకరణ ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న సురక్ష, రీ సర్వే, జెకెసి, ప్రాధాన్యత భవనాలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ రామ్సుందర్రెడ్డి, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సంబంధిత అర్జీదారులను కలిసి అర్జీ పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని క్షేత్ర స్థాయి అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఒ కె కృష్ణవేణి, జిఎస్డబ్ల్యుఎస్ అధికారి కెసిహెచ్. అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి


జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

భీమవరం : కుష్టు వ్యాధి నిర్మూలనకు అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి ఆదేశించారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. క్షయ వ్యాధి లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి, క్షయ వ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఆమె ఆవిష్కరించి మాట్లాడాలి. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 16 వరకు వైద్య శాఖ ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు గృహ సందర్శన చేసి కుష్టు వ్యాధి లక్షణాలపై స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి, స్క్రీనింగ్ నిర్వహణ చేపట్టేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ డి.భానునాయక్, డబ్ల్యుహెచ్ఒ కన్సడెంటు విఘ్నేష్, డిఎస్ఎంఒ డాక్టర్ జెవి.రామన్, పిఎంఒలు కెవి.శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, జిల్లా పంచాయతీ కార్యాలయం ఎఒ టి.రామకృష్ణ, రెడ్ క్రాస్ సీనియర్ కో-ఆర్డినేటరు ఎస్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గోపిమూర్తి సేవలు ఆదర్శం

ప్రజాశక్తి - యలమంచిలి

యుటిఎఫ్ కోశాధికారి బొర్రా గోపిమూర్తి సేవలు ఆదర్శమని పలువురు కొనియాడారు. మండలంలోని నార్ని మెరక పరిధిలోని గమల్లపెంటలో అంగన్వాడీ సెంటర్ నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.పది వేల విలువైన పుస్తకాలు, విద్యాసామగ్రిని గోపిమూర్తి తన సొంత వ్యయంతో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ ప్రముఖులు మాట్లాడుతూ సొంత ఊరిపై మమకారంతో తోటి వారికి సహాయపడాలనే సదుద్దేశంతో గోపిమూర్తి 2007 నుంచి ఇప్పటివరకు క్రమం తప్పకుండా ప్రతి ఏడాది వంద మందికి పైగా విద్యార్థులకు సహాయపడటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు,



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న గోపీమూర్తి

కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్, మండల ప్రధాన కార్యదర్శి పంత రామ్మూర్తి నాయుడు, ప్రధానోపాధ్యాయులు రామేశ్వరం సత్యనారాయణ, పాలా బాబురావు, గుత్తిందీవి శ్రీనివాసరావు, చింత సత్యనారాయణ, వెంకట గణేష్ పాల్గొన్నారు

అభివృద్ధిలో నిర్లక్ష్యం తగదు : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు కచ్చితంగా కష్టపడి పని చేయాల్సిందేనని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం భీమవరం నియోజకవర్గంలో జరుగుతున్న ఆర్అండ్బి శాఖ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సందర్భంగా ఆర్అండ్బి శాఖ అధికారుల పనితీరు సక్రమంగా లేదని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం శాఖా పరంగా జరుగుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో ప్రజల ఆకాంక్ష మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగానే ఆర్అండ్బి శాఖ నుంచి కూడా పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి రోడ్ల పనులు చేపట్టామని తెలిపారు. అధికారులు పనులను వేగవంతం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పట్ల అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి అటు ప్రజల్లోనూ, ఇటు ప్రభుత్వంలోనూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఇ లోకేశ్వరరావు, డిఇ రమణ, జెఇ మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు బడిలోనే భోజనం చేయాలి

కాళ్ల : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేయాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో-ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. కాళ్ల హైస్కూల్, కాళ్ల మెయిన్ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం పథకానికి అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. రాగి జావ, ఆకుకూరలు అన్నం, తీపి పొంగలి, పప్పుచారు రుచి చూసి విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు. పాఠశాల రికార్డులను, టాయ్లెట్ల నిర్వహణను పరిశీలించి ఆయాలకు తగు సూచనలిచ్చారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి రాగిజావ రుచి చూశారు. రెండు పాఠశాలల్లో రక్తహీనతకు ఉపయోగించే ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలోఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.లక్ష్మీనారాయణ శాస్త్రి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంవి.సుందరమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియార్టీ ప్రకారమే పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉప విద్యాశాఖాధికారి పోస్టులను కంబైన్డ్ సీనియార్టీ ప్రకారమే భర్తీ చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 74 రెవెన్యూ డివిజన్లలో ఉప విద్యాశాఖాధికారి పోస్టులను రీ-ఆర్గనైజ్ చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చిందని, ఈ పోస్టులను ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల కంబైన్డ్ సీనియార్టీ ఆధారంగానే భర్తీ చేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ వ్యత్యాసాన్ని చూపి డివైఇఒ పోస్టుల్లో కామన్ సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించేందుకు పలు ఆటంకాలు ఏర్పరుస్తున్నారని, 2017లో ప్రభుత్వం జారీ చేసిన 73, 74 జిఒలకు అనుగుణంగా డివైఇఒ పోస్టుల ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా, కంబైన్డ్ సీనియార్టీకి భిన్నంగా ఒకే మేనేజ్మెంట్ టీచర్ల పోస్టులను భర్తీ చేస్తే అడ్డుకుంటామని ఫ్యాప్టో నాయకులు హెచ్చరించారు.

అధికారులకు నోటీసులు జారీ చేయాలి

సమావేశానికి హాజరు కానివారిపై ప్రభుత్వ చీఫ్ విప్ ఆగ్రహం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల పరిషత్ సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. మొగల్తూరులోని లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఎంపిపి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలకు అధికారులు హాజరు కాకపోవడంతో ప్రభుత్వం తరపున ఏ కార్యక్రమాలు చేపట్టామో ప్రజలకు తెలిసే అవకాశం లేదన్నారు. మండలంలో సర్పంచులు, ఎంపిటిసిలు, సొసైటీ అధ్యక్షులు 44 మంది ఉండగా కేవలం 16 మంది మాత్రమే హాజరు కావడం ఏంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సామ్యూల్జాన్ మాట్లాడుతూ నాడు-నేడు ఫేజ్-2లో మండలంలో 46 పాఠశాలలు, పది అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం మాట్లాడుతూ మండలంలో సుమారు 1200 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అంచనా వేశామని, ఇప్పటివరకు సుమారు వంద ఎకరాల్లో ఆకుమడులు వేశామని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి సభ్యులు తిరుమాని బాపూజి, వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపిడిఒ వి.బాబ్జిరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : మంత్రి కొట్టు



తాడేపల్లిగూడెంలో...

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు, అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా ఇచ్చేందుకు ఇంటింటికి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పట్టణంలోని ఒకటి, రెండు, మూడు వార్డులు, మండలంలోని చిన్నతాడేపల్లి, గ్రామం, పెంటపాడు మండలంలోని అలంపురం గ్రామంలో శనివారం ఆయన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మంత్రి కొట్టు ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సాంకేతిక కారణాలతో కొంతమంది అర్హత కలిగి ఉండి పథకాలు అందుకోలేకపోతున్నారని గ్రహించి అలాంటి వాటి పరిష్కారానికి ఈ కార్యక్రమం రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నెల రోజులు పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఒకటో వార్డు వికర్స్ కాలనీలో జి.సురేష్రెడ్డి ఇంటిని సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంత్రి కొట్టు ప్రారంభించారు. రెండో వార్డులో కొనకల్ల వెంకటసుబ్బలక్ష్మి, ఒకటో వార్డులో మాదాసు ధనలక్ష్మి గృహాలను మంత్రి సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చిన్న తాడేపల్లి గ్రామంలో కంకిపాటి రాజు రాణిల ఇంటిని, అలంపురంలో పలు గృహాలను సందర్శించి వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ హార్టికల్చర్ జిల్లా అధికారి అడపా దుర్గేష్, పెంటపాడు మండలం స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, తాడేపల్లిగూడెం ఎంపిడిఒ విశ్వనాథ్, తహశీల్దార్ అప్పారావు, జెడ్పిటిసి సభ్యులు ముత్యాల ఆంజనేయులు, చిన్న తాడేపల్లి సర్పంచి పిచ్చుకల రాజారావు, ఉప సర్పంచి చిట్టూరి కాశి పాల్గొన్నారు.

కాళ్ల : జగనన్న సురక్ష కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి కె.కిషోర్కుమార్ కోరారు. మండలంలోని జక్కరం గ్రామంలో స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన సచివాలయ సిబ్బంది వివరాలు, పనివిధానం, పథకాల అమలులో జరుగుతున్న జాప్యం, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ, గృహసారథులతో కలిసి ఇంటింటికి తిరిగారు. అర్హులై ఉండి పథకాలకు దూరంగా ఉన్న వారిని గుర్తించి అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి,స్వాతి, తహశీల్దార్ డిఎ.కృష్ణారావు, ఇఒపిఆర్డి ఎంవి.భాస్కరరావు, గ్రామ కార్యదర్శి ఎస్కె.జమాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : మండలంలోని ముప్పర్తిపాడు, గణపవరం మూడో సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ పి.లక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. దీంతోపాటు వారికి కావాల్సిన ముఖ్యమైన 11 సర్టిఫికెట్లను అందిస్తామని చెప్పారు.

భాగ్యప్రసాద్కు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్లో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పని చేస్తున్న బి.భాగ్యప్రసాద్ ఐఐటి చెన్నై నిర్వహించిన ఎన్పిటిఇఎల్ (నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాండ్స్ లెర్నింగ్లో) జాతీయస్థాయిలో డిసిప్లెన్ స్టార్ అవార్డు పొందారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ తెలిపారు. డిసిప్లెన్ స్టార్ అవార్డు పొందిన భాగ్య ప్రసాద్ను శనివారం కళాశాలలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్బాబు, ఇసిఇ హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్కుమార్, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ ఎస్ఆర్కెఆర్ ప్రొఫెసర్ అవార్డు సాధించడం గర్వకారణమన్నారు. భాగ్య ప్రసాద్ను అధ్యాపక బృందం అభినందించారు.

నేత్రాలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతిఒక్కరూ నేత్రాలను సంరక్షించుకోవాలని డిఎంహెచ్ఒ డి.ఉమామహేశ్వరరావు అన్నారు. పొలమూరు-2లో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వైద్యాధికారి టిఎ.రాజ్కుమార్ మాట్లాడుతూ 300 మందికి వైద్య పరీక్షలు చేయగా 30 మందికి శస్త్ర చికిత్సలకు, వంద మందికి కళ్లజోళ్లు ఉచితంగా ఇవ్వడానికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇ డి తులసి, డి.శ్రీనివాస్, ఎంఎల్హెచ్పి దేవి, ఎల్టి రాజ్కుమార్, ఎఎన్ఎం వీరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో ఏర్పాటు చేసే వైఎస్ఆర్ కంటి వెలుగులో కంటి పరీక్షలు చేయించుకుని కళ్ల సమస్యలు పరిష్కరించుకోవాలని సరిపల్లి గ్రామ సర్పంచి చనుమూరి లక్ష్మీభవాని అన్నారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సరిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి 25 మందికి కళ్లజోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోషనాయుడు, సిహెచ్ఒ జాలాది విల్సన్బాబు, బి.మౌనిక పాల్గొన్నారు.

జొన్నలగరువులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లంకలకోడేరు పరిధిలో ఉన్న జొన్నలగరువులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులను పరీక్షించి తగిన మందులు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.ప్రభాకర్, ఎంఎల్హెచ్పిలు పి.సుజిత, కె.సుశీల, ఎఎన్ఎంలు, 104 వాహన సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.